
సాక్షి ఖమ్మం

సోమవారం । 3 । మార్చి । 2025





అమ్మవారి కటాక్షం ఉన్నా..

పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతున్నా వసతుల కల్పనలో దేవాదాయశాఖ నిర్లక్ష్యంగా ఉంది. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
38° / 21°

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మాత్రం వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం : ప్రజాసేవకు అంకితమైన స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు సమాజానికి ఆదర్శప్రాయుడని అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్పీకర్‌గా పనిచేసిన శ్రీపాదరావు జయంతి వేడుకలను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఆర్‌ఐలు అప్పలనాయుడు, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను నిర్మూలించాలి



మాట్లాడుతున్న కె.ఎల్. కాంతారావు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం : సమాజంలో మూఢ నమ్మకాలను నిర్మూలించడంతో పాటు శాస్త్రీయ ఆలోచనలు పెంచేలా జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు కృషి చేయాలని జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.ఎల్. కాంతారావు అన్నారు. జేవీవీ అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచీకరణ దుష్ఫలితాలతో సమాజంలో అభద్రతా భావం పెరిగిందని, దీంతో కొందరు మూఢనమ్మకాల వైపు పయనిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు మతోన్మాద శక్తులు మూఢ నమ్మకాలను పెంచుతున్నాయని విమర్శించారు. సాక్షాత్తూ పాలకులే వీటిని పెంచడం విచారకరమని అన్నారు. మనిషి మనుగడకు, అభివృద్ధికి సైన్స్ దోహదం చేస్తుందన్నారు. సదస్సులో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కట్టా సత్యప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రరావు, అధ్యక్షులు వి.మోహన్, నాయకులు మచ్చా సూర్యనారాయణ, వంజాకు లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.శివన్నారాయణ, సమత, కన్వీనర్ కె.రాములమ్మ, ఝాన్సీ కుమారి, కె.రామారావు వాసిరెడ్డి మల్లికార్జున్‌రావు, ప్రతాప్, పొత్తూరి సీతారామారావు, దేవేంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'నచికేత'



'నచికేత' నాటికలో ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి హైదరాబాద్ రసరంజని కళా బృందం ప్రదర్శించిన 'నచికేత' నాటిక ప్రేక్షకులను అలరించింది. మృత్యు రహస్యాన్ని తార్కికంగా, స్పష్టంగా, గంభీరంగా విశదపరిచిన వైనాన్ని ఈ నాటిక ద్వారా తెలియజేశారు. ఆకెళ్ల శివప్రసాద్ రచనలో ఆచార్య కోట్ల హన్మంతరావు దర్శకత్వం వహించిన నాటిక ప్రదర్శనకు నెల నెలా వెన్నెల నిర్వాహకులు సహకరించారు. డాక్టర్ వెంకట్ గోవాడ, సాధు శ్యాం ప్రసాద్, మోహన్ సేనాపతి, మేకా రామకృష్ణ, సత్కళాభారతి సత్యనారాయణ, సన్నిధి కోట్ల, సురేష్, కుదీర్, మోహన్, యుగంధర్, నర్సింహ యాదవ్, సాయిగౌడ్, రాజీవ్ నాయక్ అద్భుత నటనను ప్రదర్శించారు. కార్యక్రమంలో అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, కె.దేవేంద్ర, నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఉపాధి.. పని ఏది?

ఈజీఎస్ కూలీల ఎదురుచూపులు

- వ్యవసాయ పనులు తగ్గడంతో ఇటువైపు మొగ్గు
- జిల్లాలో లక్ష్యం 62.17లక్షల పని దినాలు
- ఇప్పటివరకు పూర్తి చేసింది 54.89 లక్షలే..



ఖమ్మంమయూరిసెంటర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనుల కోసం కూలీలు ఎదురుచూస్తున్నారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఉపాధి హామీ పథకాన్ని చేపట్టాయి. అయితే ఈ పథకం లక్ష్యం క్షేత్రస్థాయిలో నెరవేరడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సొంత గ్రామాల్లో పనులు దొరకక పక్క గ్రామాలకు, ఇతర జిల్లాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలే తమకు కూలీ పనులు చూపించాలని కోరే వరకు పరిస్థితి వచ్చింది. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నా జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం పనులు కల్పించకపోవడం గమనార్హం.

62.17 లక్షల పనిదినాల లక్ష్యం..

అత్యధిక మంది గ్రామీణ ప్రాంత కూలీలు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందుతుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా పొందేవారి సంఖ్య చూస్తే ఖమ్మం జిల్లాలోనే అధికంగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా జిల్లాకు అదే స్థాయిలో ప్రభుత్వం పనిదినాలను కేటాయిస్తోంది. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 55.89 లక్షల పనిదినాలు అవసరం ఉంటుందని ఎంపీడీఓలు ప్రణాళిక రూపొందించారు. ఈ నివేదికను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అయితే జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 62.17 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించింది. గతేడాది 46.38 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, జిల్లాలో పూర్తి చేసిన పనిదినాలు 54.79 లక్షలు. ఇలా గతేడాది కూలీల నుంచి వచ్చిన డిమాండ్‌తో ఈ ఏడాది ప్రభుత్వం 62.17 లక్షలకు పనిదినాలుగా పెంచింది. అయితే జిల్లాలో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ఆరేళ్లుగా పనిదినాల సంఖ్య (లక్షల్లో)

ఏడాది	లక్ష్యం	పూర్తి చేసినవి
2024-25	62.17	54.89 (ఇప్పటివరకు)
2023-24	46.38	54.79
2022-23	54.42	65.63
2021-22	64	65.63
2020-21	71.05	70.38
2019-20	55	60.04

వచ్చే ఏడాది 54.97 లక్షల పనిదినాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో జిల్లాలో గ్రామీణప్రాంత కూలీలకు కల్పించాల్సిన పని దినాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఎంపీడీఓల ఆధ్వర్యంలో మండలాల వారీగా పనిదినాలను నివేదిక రూపంలో జిల్లా అధికారులకు అందించారు. జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద 54.97 లక్షల పనిదినాలు కల్పించాలని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. వాటి ఆధారంగా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని ఖరారు చేయనుంది.



జిల్లాలో జాబ్‌కార్డులు, కూలీల వివరాలు

గ్రామపంచాయతీలు	589
జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాలు	3.06 లక్షలు
కూలీల సంఖ్య	6.43 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య	1.82 లక్షలు
యాక్టివ్ కూలీల సంఖ్య	3.07
ఈ ఏడాది ఇప్పటి వరకు అయిన ఖర్చు	రూ.195.86 కోట్లు
కూలీలకు చెల్లించిన వేతనాలు	రూ.119.73 కోట్లు
మెటీరియల్ కింద చెల్లించింది	రూ.66.20 కోట్లు

వ్యవసాయ పనులూ అంతంతే..

పని కోసం ఎదురు చూస్తున్న కూలీల సంఖ్య జిల్లాలో భారీగానే ఉంది. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్లే కుటుంబాల సంఖ్య అధికారిక లెక్కల ప్రకారం 1.82 లక్షలు ఉండగా.. అందులో యాక్టివ్ కూలీల సంఖ్య 3.07 లక్షలు. ఇక ఈ ఏడాది జిల్లాలో మిర్చి పంట దెబ్బతినడం, పత్తి ముందుగానే బీడు పోవడం, ఇతర పంటలకు మిషన్లు అందుబాటులో ఉండడంతో కూలీలకు వ్యవసాయ పనులు దొరకడం లేదు. జిల్లాలో మార్చి నెలాఖరు నుంచి ఉపాధి పనుల వైపు మొగ్గు చూపే కూలీలు ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచే ఎదురుచూస్తున్నారు.

ఉత్తిపోతలు!



దుమ్ముగూడెం ఆనకట్ట మీదుగా ప్రవహిస్తున్న గోదావరి జలాలు

- దుమ్ముగూడెం ఆనకట్ట మీదుగా ప్రవహిస్తున్న గోదావరి
- గత నెల 27న పంప్‌హౌస్–1లో మోటార్లు ప్రారంభం
- రాజీవ్ లింక్ కెనాల్‌లో పూర్తికాని ప్యాచ్ వర్క్ పనులు
- సీతారామ నీళ్లు ఎన్‌ఎస్‌పీ కాల్వకు చేరే అవకాశం లేనట్టే!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు 2024 ఆగస్టు 15 నాటికి అందివ్వాలనే లక్ష్యంతో గతేడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు దృష్టి పెట్టారు. ఆ దిశగా అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. సీతారామ ప్రధాన కాలువను నాగార్జున సాగర్ కాలువకు కలుపుతూ కొత్తగా రాజీవ్ కెనాల్‌ను తెరమీదకు తెచ్చారు. కాలువ నిర్మాణ పనుల కోసం రమారమీ రూ. 100 కోట్లు కేటాయించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద భూసేకరణ చేపట్టారు. రేయింబవళ్లు యంత్రాలు పరుగులు పెట్టాయి. ఆగస్టు మొదటి వారం నాటికే వానలు విస్తారంగా కురవడం, నాగార్జున సాగర్ డ్యామ్ నిండుకుండలా మారడంతో ఎన్‌ఎస్‌పీ కెనాల్‌కు సమృద్ధిగా కృష్ణా జలాలు అందాయి. దీంతో గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించే అవసరం లేకుండా పోయింది.

సిద్ధమైన పంప్‌హౌస్‌లు

రాజీవ్ కెనాల్ పనులు 2024 ఆగస్టు 15 నాటికి పూర్తవలేదు. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి జూలూరుపాడు వరకు 102 కి.మీల ప్రధాన కాలువ దాదాపుగా అందుబాటులోకి వచ్చింది. ఇదే సమయంలో బీజీ కొత్తూరు, పూసుగూడెం (వీకేరామవరం), కమలాపురం దగ్గర ఉన్న మూడు పంప్‌హౌస్‌లలో రెండు వంతున మోటార్లను రెడీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్వాతంత్ర దినోత్సవం రోజు ఈ మూడు పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి నీటిని ఎత్తిపోశారు. ఇదే స్పీడ్‌లో పనులు జరిగి రాజీవ్ కెనాల్ అందుబాటులోకి వస్తే వేసవిలో నీటిని ఎత్తిపోయచ్చనే నమ్మకం కలిగేది.

పొంగిన గోదావరి

గత ఫిబ్రవరి చివరి వారంలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. మరోవైపు సాంకేతిక కారణాల వల్ల దుమ్ముగూడెం బరాజ్‌కి ఎగువన ఉన్న సమ్మక్క బరాజ్ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. ఫిబ్రవరి 26 నాటికి దుమ్ముగూడెం ఆనకట్ట నిండి కిందకు నీరు ప్రవహించడం మొదలైంది. అప్పటికే మూడు పంప్‌హౌస్‌లలో రెండు వంతున మోటార్లు సిద్ధమై ఉండటంతో గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా వైరా రిజర్వాయర్‌కు తరలిస్తారా ? లేదా అనే ప్రశ్నలు తలెత్తాయి. ఎట్టకేలకు ఫిబ్రవరి 27న బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌లో మోటార్లను ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోశారు. ఇక్కడి నుంచి ఈ నీరు ఎప్పుడెప్పుడు వైరా రిజర్వాయర్‌కు చేరుతుందా అని ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది.

పెండింగ్‌లోనే పనులు

రాజీవ్ కెనాల్ నిర్మాణ పనుల్లో 2024 ఆగస్టు 15 తర్వాత వేగం తగ్గింది. ఇప్పటికీ ప్రధాన కాలువపై విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారిపై అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెం దగ్గర వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. అదేవిధంగా రాజీవ్ లింక్ కెనాల్‌కు సంబంధించి గ్యాస్ పైప్ లైన్ దగ్గర నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు ఇటు ప్రధాన కాలువ, అటు రాజీవ్ కెనాల్‌లలో ఇప్పటికీ ప్యాచ్‌వర్క్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్ట మీద నుంచి పొంగిపొర్లుతున్న గోదావరి నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాలేదు.

ప్రధాన కాలువకే పరిమితం

మొదటి పంప్‌హౌస్ నుంచి ఫిబ్రవరి 27న ఎత్తిపోసిన నీరు రెండో పంప్ హౌస్ వరకు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం అక్కడి నుంచి మూడో పంప్‌హౌస్‌కు నీటిని ఎత్తిపోశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎత్తిపోతల తీరును పరిశీలిస్తే రాజీవ్ లింక్ కెనాల్‌తో పాటు ఇతర పనులు పూర్తికానందున ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదావరి నీరు ఎన్‌ఎస్‌పీ కెనాల్‌కు పారే అవకాశం లేనట్టే. కేవలం సీతారామ ప్రధాన కాలువలో నిల్వకే అక్కరకు వచ్చేలా మారాయి.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ఎస్సీ బాలికల (ఏ) వసతిగృహం వార్షికోత్సవంలో వక్తలు



క్రీడా పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్ : ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ అన్నారు. నగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం (ఏ) వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ.. పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా వసతిగృహ విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారిణి నెల్లూరి విజయ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూఓ అబ్దుల్ రవూఫ్, వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, టీఎన్జీవోస్ నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, మన్మధరావు, సుధాకర్, వసతిగృహ సంక్షేమ అధికారులు జి.వరలక్ష్మి, టి.స్టాలిన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ఖమ్మం స్పోర్ట్స్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన మహిళల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన నాలుగో తరగతి మహిళా ఉద్యోగులు పాల్గొనడం శుభ పరిణామమన్నారు. టెన్నికాయిట్, పరుగుపందెం, షాట్‌పుట్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ప్రతినిధులు ఎస్.లలిత కుమారి, ఎస్.రాధికారెడ్డితో పాటు నాయకులు కోడి లింగయ్య, జి.నాగేశ్వరరావు, అజ్మీత్ జోగి, మాధవి, సీత, చావా నారాయణ పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

పోస్టల్ శాఖ ఎస్పీ వీరభద్ర స్వామి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఖమ్మం పోస్టల్ ఎస్పీ వీరభద్రస్వామి

పాల్వంచ: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించాలని పోస్టల్ శాఖ ఖమ్మం డివిజన్ ఎస్పీ వి.వీరభద్రస్వామి సూచించారు. ఇటీవల పాల్వంచ విద్యుత్ కళాభారతిలో జిల్లాస్థాయి వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని దమ్మపేట, కారేపల్లి, కొమ్మినేపల్లి, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ, సత్తుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన పోస్టల్ గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీల్లో ఇల్లెందు టీం విన్నర్‌గా, కారేపల్లి టీం రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఆదివారం కేఎస్‌పీ రోడ్‌లోని వాసవీ హాల్‌లో బహుమతులు అందించారు. విన్నర్ జట్టుకు రూ.10,116, రన్నర్ టీంకు రూ.5,116 నగదు, ట్రోఫీ అందించి మాట్లాడారు. కార్యక్రమంలో పాండురంగాపురం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ బండి పుల్లారావు, ఏఐజీడీఎస్‌యూ తెలంగాణ సర్కిల్ సెక్రటరీ బండి జయరాజు, ఉపాధ్యక్షుడు వై.పట్టాభిరామయ్య, డివిజన్ సెక్రటరీ ఎండి.ఖాజామొహినుద్దీన్, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు ఎస్‌కె.మౌలాలి, భద్రాచలం బ్రాంచ్ ట్రెజరర్ జి.సాయితేజ పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల కోలాహలం

ఒకరోజు ఆదాయం రూ.21,055

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 302 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,325 ఆదాయం లభించగా, 250 మంది బోటుషికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.10,730 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

దివ్యకారుణ్య తత్వాన్ని పెంపొందించుకోవాలి

కర్నూల్ బిషప్ జ్యానేష్

ఖమ్మం రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్య కారుణ్య తత్వాన్ని పెంపొందించుకోవాలని కర్నూల్ బిషప్ జ్యానేష్ పిలుపునిచ్చారు. ఖమ్మం మేత్రాసనం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ సారథ్యంలో కరుణగిరి ప్రాంగణంలో పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవం ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషులంతా తోటి వారి పట్ల కరుణ, శాంతితో మెలగాలని కోరారు. ఏసుప్రభు చూపిన మార్గం అందరినీ విశిష్ట మానవులుగా తీర్చిదిద్దుతుందన్నారు. బిషప్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ.. లోక రక్షకుని బోధనలతో నవ వసంతం నిండుతుందన్నారు.

ఈ ఉత్సవాల్లో విశ్వాసంతో పాటు ఆధ్యాత్మిక భావన వెల్లివిరిసిందని చెప్పారు. ముగింపు వేడుకల సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. విజేతలకు బహుమతి ప్రదానంతో పాటు బిషప్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ మ్యాత్యూవరప్రసాద్ రాజు, వీజే శౌరి, సూరేపల్లి ఐజాక్, చాన్సలర్ జర్నీస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిషప్ జ్యానేష్

రండి.. రారండి!



ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల ప్రచారం
- సౌకర్యాలు, ఫలితాలను వివరిస్తూ ప్రవేశాలకు ఆహ్వానం
- 'న్యాక్ ఏ' గ్రేడ్ ఉండడంతో విద్యార్థినులు సైతం ఆసక్తి

ఖమ్మం సహకారనగర్: కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు ఏటా విద్యాసంస్థల బాధ్యులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా చెప్పొచ్చు. 'మా పాఠశాలలో చేరండి.. మా కళాశాలలో చేరండి' అంటూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది ప్రచారం చేయడం అందరికీ తెలిసిందే. కానీ ఇప్పుడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సైతం తమ కళాశాలలో చేరాలంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లి విస్తృత ప్రచారం చేస్తుండడం గమనార్హం.

ఏకైక కళాశాల..

జిల్లా కేంద్రంలో మహిళా విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకటే ఉంది. ఇక్కడ వివిధ శాఖలకు చెందిన హాస్టళ్లు ఉండడంతో ఇతర ప్రాంతాల విద్యార్థినులు సైతం హాస్టళ్లలో ఉంటూ కళాశాలలో చదివేందుకు ఆస్కారముంది. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాలకు ఖమ్మం సమీపాన ఉండడం కలిసొచ్చే అవకాశంగా చెబుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ.. ఉత్తమ ఫలితాలు

ఈ కళాశాలలో విద్యార్థినులపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడంతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. దీంతో ఏటా విద్యార్థినులు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించడంతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయనే భావనతో ఇక్కడ చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లే కాక వివిధ పోటీ పరీక్షలు, యువజనోత్సవాల్లో అధ్యాపకుల సహకారంతో సత్తా చాటుతున్నారు.

ముందస్తు ప్రచారం

వచ్చే విద్యాసంవత్సరం కళాశాలలో ప్రవేశాల సంఖ్య మరింత పెరిగేలా ప్రభుత్వ ఆదేశాలతో అధ్యాపకులు ముందస్తు ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఖమ్మం నగరంతో పాటు సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లోని ప్రభుత్వ, అనుబంధ జూనియర్ కాలేజీలకు వెళ్లి తమ కళాశాలలో ఉన్న వసతులు, ఫలితాలను వివరిస్తున్నారు. ఇందుకోసం ప్రైవేట్ కళాశాలలకు దీటుగా కలర్ బ్రోచర్లు ముద్రించడం విశేషం. ఇలా రకరకాల కారణాలతో వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థినుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

గత కొన్నేళ్లుగా కళాశాలలో ప్రవేశాలు

సంవత్సరం	ఎంపీసీ	బీజెడ్‌సీ	బీఏ	బీకాం	మొత్తం
2022-23	30	57	86	71	244
2023-24	13	65	80	72	230
2024-25	24	52	84	74	234



మహబూబాబాద్ బాలికల జూనియర్ కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

వచ్చే ఏడాది అటానమస్ హోదా

1965లో స్థాపించిన ఈ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నాం. నెట్, సెట్, డాక్టరేట్ అర్హతలు కలిగిన అధ్యాపకులు బోధిస్తున్నారు. 2025 – 26 విద్యాసంవత్సరం నుంచి అటానమస్ హోదా లభించనుంది. ఇప్పటికే న్యాక్–ఏ ఉన్నందున విద్యార్థినులు చేరేందుకు ముందుకు రావాలి.

– జి.పద్మావతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

క్లుప్తంగా

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి వివిధ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

చోటేబాబాకు గౌరవ డాక్టరేట్



చోటేబాబాకు డాక్టరేట్ అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం : ఖమ్మం నగరానికి చెందిన కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకుడు షేక్ చోటేబాబా చేసిన సామాజిక సేవలను గుర్తించిన యూరోపియన్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆదివారం ఢిల్లీలో యూరోపియన్, అమెరికన్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ప్రపంచంలోని పలు దేశాల్లో ఆయా రంగాల్లో సేవ చేసిన వారిని గుర్తించగా అందులో చోటేబాబాకు స్థానం దక్కడం విశేషం.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జిమ్ నిర్వాహకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నాలుగేళ్ల చిన్నారి పాసి కృతిక చికిత్స నిమిత్తం రామవరం ఏరియా హనుమాన్ జిమ్, బ్లడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా చేతుల మీదుగా చిన్నారి తండ్రి, ఆటో డ్రైవర్ కల్యాణ్ పాసికి నగదు అందజేశారు. చిన్నారి పూర్తిస్థాయి చికిత్స కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. జిమ్ ఫౌండేషన్ సభ్యులు దాసు, సుధాకర్, లడ్డు, రాజేష్, సురేష్, దిలీప్, వసంత్, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు

చర్ల: సరిహద్దు గ్రామాల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఉన్న సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల ఆదివాసీలు సరుకులు కొనుగోలు కోసం వస్తుంటారు. వారి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చనే అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులు తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్‌కాలనీ, కలివేరు క్రాస్‌రోడ్, దానవాయిపేట ప్రాంతాల్లో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. వచ్చిపోయే వారిని నిశితంగా పరిశీలించారు. పులువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి విడిచిపెట్టారు.

అలరించిన లఘుచిత్రాల ప్రదర్శన



శుభ సంకల్పం చిత్ర దర్శకుడికి మెరిట్ సర్టిఫికెట్ అందిస్తున్న వినయ్‌కుమార్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన లఘు చిత్రాల ప్రదర్శనలు అలరించాయి. దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో రెండేళ్లుగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ లఘు చిత్రాలు ప్రదర్శిస్తుండగా ఆదివారం ఖమ్మంలో ఏర్పాటుచేశారు. సమాజ చైతన్యం కోసం రూపొందించిన చంద్రుడు, అంతరం, సాగరవాసి, శుభసంకల్పం, వాట్సాప్ స్టేటస్, జన్మనిచ్చిన తల్లికి, వలస గోస వంటి లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫిలిం సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. అభ్యుదయ భావాలను విస్తరింపేందుకే ఇలాంటి చిత్రాలను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఫిలిం సొసైటీ కార్యదర్శి బీడీఎల్ సత్యనారాయణ, మల్లం రమేష్, నెల నెలా వెన్నెల నిర్వాహకులు పాల్గొన్నారు.

అమ్మవారి కటాక్షం ఉన్నా..

కరుణించని దేవాదాయశాఖ

- పెద్దమ్మతల్లి ఆలయం వద్ద కొరవడిన సౌకర్యాలు
- రోజూ వేలాది మంది వస్తున్నా బాత్‌రూంలు పదే..
- ప్రతిపాదించి రెండేళ్లయినా అమలుకు నోచుకుని మాస్టర్‌ప్లాన్
- ఆదాయం ఉన్నా భక్తులకు వసతులు కల్పించని ఎండోమెంట్ శాఖ





అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారు

పాల్వంచరూరల్: కోరిన కోరికలు తీర్చే పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. పాల్వంచ మండలం కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) గుడికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తుంటారు. రోజూ వేలాది మంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. గురు, ఆదివారాల్లో రద్దీ ఇంకా ఎక్కువగా ఉంటుంది. పరిసర గ్రామాల, పట్టణాల ప్రజలు ఏ పనులు ప్రారంభించాలన్నా తొలుత అమ్మవారిని దర్శించుకుంటారు. జిల్లాలో భద్రాచలంలో సీతారామచంద్రస్వామి ఆలయం తర్వాత దేవాదాయ శాఖకు ఎక్కువ ఆదాయం ఇక్కడి నుంచే వస్తోంది. టికెట్లు, కొబ్బరి చిప్పలు, అద్దెలు, తలనీలాలు, హుండీ ద్వారా ఏటా రూ.3.5 కోట్ల ఆదాయం వస్తున్నట్లు ఎండోమెంట్ అధికార లెక్కలు చెబుతున్నాయి. ఇటీవల ఆలయ ప్రాంగణంలో నూతనంగా శివాలయం కూడా నిర్మించారు. దీంతో భక్తుల సంఖ్య మరింతగా పెరిగింది. అయితే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో మౌలిక సౌకర్యాలు లేవు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇక్కట్లు తప్పడంలేదు.

తాగునీరు కూడా లేదు..

ఆదాయం మెండుగా, భక్తుల రద్దీ అధికంగా ఉన్నా దేవాదాయ శాఖ, పాలకవర్గం వసతి సౌకర్యాలు కల్పించడంలేదు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు స్నానాలు చేసేందుకు గతంలో నిర్మించిన ఆరు బాత్ రూమ్‌లను కూల్చివేశారు. గుడికి ఎదురుగా ప్రధాన రహదారి దాటి వెళ్తే మరికొన్ని బాత్ రూమ్‌లు ఉన్నాయి. అవి భక్తుల సంఖ్యకు తగినన్ని లేకపోవడంతోపాటు నిర్వహణ అధ్వానంగా మారింది. దీంతో స్నానాలగదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. అమ్మవారి దర్శనం కోసం ఒకే క్యూలైన్ ఉండగా, ఇబ్బంది తప్పడంలేదు. గతంలో ఆలయం ఎదురుగా ఉన్న చెట్ల కింద నైవేద్యం వండుకుని అమ్మవారికి సమర్పించేవారు. ఆ చెట్లు కూడా తొలగించడంతో నీడ కరువైంది. అక్కడ కొత్త భవనం నిర్మించడంతో వంటలు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది.

పాలకవర్గం లేక ఏడాది

ఏడాది కాలంగా ఆలయానికి పాలకవర్గం లేదు. నూతన పాలకవర్గ నియామకంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. నోటిఫికేషన్ జారీ చేసినా నియామక ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. దీంతో ఈఓ పర్యవేక్షణలో ఆలయంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. క్రమంగా భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో గత ఈఓ శ్రీనివాసరావు ఆలయాన్ని లోపలకు జరిపి పునర్నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు. మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి నివేదించినా ఇప్పటివరకు మోక్షం లేదు. ఆలయ అభివృద్ధిపై, సౌకర్యాల కల్పనపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు.

భక్తులు ఏం కోరుతున్నారంటే..

ఆలయంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి. ప్రస్తుతం ఒకే క్యూలైన్ ఉన్నందున, అదనపు క్యూలైన్‌లు ఏర్పాటు చేయాలి. భక్తుల సంఖ్య తగినట్లు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి. పాల్వంచ, భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ సర్వీసులు నడిపించాలి. అన్ని డిపోల, అన్ని రకాల సర్వీసులు ఆలయం వద్ద నిలిపేలా చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక సత్రాలు, గదులు నిర్మించాలి. పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. భద్రాచలంలో మాదిరిగా నిత్యాన్నదానం ఏర్పాటు చేయాలి.

స్నానాల గదులు ఏర్పాటు చేయాలి



పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకునే మహిళా భక్తులు కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా స్నానాల గదులు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలి . క్యూలైన్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

–అరుణ, భక్తురాలు, మహబూబాబాద్

నిద్ర చేసేందుకు సత్రం నిర్మించాలి



అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు ఆలయ సన్నిధిలో బస చేసేందుకు సౌకర్యంలేదు. దీంతో వచ్చిన రోజే తిరిగి వెళ్లిపోతున్నారు. నిద్ర చేసేందుకు సత్రం, గదులు నిర్మిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. తాగునీరు కూడా అందించాలి.

–శ్రుతి, భక్తురాలు, హైదరాబాద్

ప్రతిపాదనలు పంపాం



భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పది బాత్‌రూమ్‌లు నిర్మిస్తున్నాం. మరో పది స్నానాల గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. మాస్టర్ ప్లాన్ అమలుకు దేవాదాయ శాఖ కమిషనర్‌కు గతంలో ప్రతిపాదనలు పంపించాం. అనుమతులురాగానే పనులు ప్రారంభిస్తాం.

–ఎస్.రజనీకుమారి, ఈఓ

సమాజ సేవలో ముందుండాలి



కమిటీ సభ్యులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కమ్మ మహాజన సంఘం పాలకవర్గం ప్రమాణస్వీకారంలో మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్ : సమాజ సేవలో కమ్మ మహాజన సంఘం సభ్యులు ముందుండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సంఘం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం ఖమ్మంలోని స్వర్ణ భారతి కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. జాతి ఔన్నత్యాన్ని పెంపొందించేలా కమిటీ నడవడిక ఉండాలన్నారు. పెద్దలు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గొట్టిపాటి సత్యవాణి మాట్లాడుతూ కమ్మవారు అనేక రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. సంఘన్ని రాజకీయ చట్రంలో బిగించకుండా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు, చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మల, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, కోలేటి నవీన్, మేదరమెట్ల స్వరూపారాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వర్, తుమ్మలపల్లి నాగేశ్వరావు, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళితే..

మధిర: వైద్యం కోసం ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చేసరికి చోరీ జరిగిన ఘటన మహదేవపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామారావు వైద్య చికిత్స కోసం కుటుంబసభ్యులతో కలిసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడే కొద్ది రోజులు ఉండి తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. ఈలోగా గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. రూ.30 వేల విలువైన నగలు చోరీకి గురయ్యాయని బాధితుడు మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చోరీ ఘటనపై కేసు నమోదు

కూసుమంచి : కూసుమంచి గ్రామానికి చెందిన షేక్ సఫియా గత నెల 27న సూర్యాపేటలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం తిరిగి రాగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి రెండు తులాల బంగారు నానుతాడు, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఓసీలో కాలిపోతున్న బొగ్గు

అధికారుల ప్రణాళిక లోపంతో సంస్థకు నష్టం



మణుగూరు ఓసీలో మండుతున్న బొగ్గు

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఓపెన్ కాస్టులో బొగ్గు రాశులు తగలబడుతున్నాయి. ఎంతో కష్టపడి తీసిన, విలువైన బొగ్గు కళ్ల ముందే కాలిపోతోందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో స్టాక్ యార్డ్ వద్ద ఉంచిన బొగ్గు కాలి దట్టమైన పొగలు వ్యాపిస్తున్నాయి. అధికారులు మంటలను నిరోధించే చర్యలు తీసుకోకపోవడంతో పొగతో కార్మికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కార్మికుల శ్రమ, యంత్రాలను వినియోగించి వెలికితీసిన బొగ్గు మండిపోవడంతో సింగరేణి సంస్థకు సైతం నష్టం వాటిల్లుతోంది. సింగరేణి యాజమాన్యం ప్రణాళిక రూపొందించి వార్షిక లక్ష్య సాధనకు ప్రయత్నిస్తుండగా మణుగూరు ఓసీ అధికారుల తీరుతో ఆ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొగ్గు రాశులను తరచూ నీటి ద్వారా తడుపుతూ మంటలను నిరోధించాలని, కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

ఇద్దరికి గాయాలు



రాజగోపాలా చార్యులు (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీ నగరం గ్రామంలోని శ్రీ దాసాంజనేయ ఆలయ పూజారి ఆరుట్ల రాజగోపాలాచార్యులు (50)మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన మర్మం ఏడుకొండలు బైక్‌పై తన భార్యతో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీనగరం శివారులో రోడ్డు దాటుతున్న అర్చకుడిని బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ముగ్గురికీ తీవ్ర గాయాలు కాగా, 108 ద్వారా భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి పూజారి మృతి చెందాడు. ఏడు కొండలు పరిస్థితి విషమంగా ఉండగా, అతని భార్య ఒక కన్ను కోల్పోయింది. వీరు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని సీఐ అశోక్ సందర్శించి వివరాలు సేకరించారు.

రిటైర్డ్ ఎస్సై ఆత్మహత్య



మృతదేహంపై పూలదండ వేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు



ఖాజా మొహినుద్దీన్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: రిటైర్డ్ ఎస్‌ఐ ఒకరు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మీదేవిపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. కొత్తగూడెం త్రీటౌన్‌లో పని చేసిన ఎస్‌ఐ ఖాజా మొహినుద్దీన్ (65) గతేడాది ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామంలో కుటుంబంతో నివాసముంటున్నాడు. ఇటీవల తన భార్య అనారోగ్యంగా ఉండటం, పిల్లలు ఇంకా సెటిల్ కాకపోవడంతో మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లోనే చీరతో ఉరేసుకుని మృతి చెందు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బూడిదగడ్డ ఏరియాలో మరొకరు..

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని బూడిదగడ్డ ఏరియాలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. బూడిదగడ్డ ఏరియాకు చెందిన పుట్టా రంజిత్ (30) సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు వేరే ఊరికి వెళ్లడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యులు వచ్చాక ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పురుగుమందు తాగి..

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన బండారి నాగరాజు(40) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం కనిపించలేదు. దీంతో మనో వేదనకు గురైన నాగరాజు శనివారం చేనుకు వెళ్లి అక్కడే గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆర్‌ఎంపీ..

పెనుబల్లి: మండల పరిధిలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పద్దం నర్సింహారావు(31) కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబంలో కొంతకాలంగా కలహాలు తీవ్రం కావడంతో నర్సింహారావు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం రామచంద్ర బంజర గ్రామ శివారు నాయకుల గూడెం రోడ్డు వద్ద గడ్డిమందు తాగి పడుకున్నాడు. అటుగా వెళ్లేవారు చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నర్సింహారావు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

సత్తుపల్లి టౌన్ : సత్తుపల్లి మండలం రామానగరంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. రెండు కోడి పుంజులు, ఏడు ద్విచక్ర వాహనాలు, రూ.1,640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐఈడీ నిర్వీర్యం

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్‌లోని కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధి దుంపమార్క గ్రామం అటవీప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబును భద్రతా బలగాలు ఆదివారం గుర్తించాయి. రైగుట్టహిల్ అడవుల్లో బలగాలు కూంబింగ్ చేపడుతున్న క్రమంలో ఐదు కేజీల ఐఈడీ బాంబును గుర్తించి నిర్వీర్యం చేశాయి.

మద్యం మత్తులో వికృత చేష్టలు

మహిళ స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసిన కేటీపీఎస్ ఉద్యోగి?

పాల్వంచ: మూడు రోజుల క్రితం ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్ భార్య స్నానం చేస్తుండగా అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే కేటీపీఎస్ ఉద్యోగి ఫొటోలు తీశాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దివ్యాంగుడైన వ్యక్తి వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. భార్య, కుమారుడితో కలిసి అపార్ట్‌మెంట్‌లోనే ఓ గదిలో నివాసముంటున్నాడు. కాగా అతని భార్య బాత్రూంలో స్నానం చేస్తుండగా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే కేటీపీఎస్ ఉద్యోగి మద్యం తాగి వచ్చి వెంటిలెటర్ నుంచి సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశాడు. దీంతో గుర్తించిన మహిళ ఆందోళనకు గురై ప్రశ్నించడంతో గొడవ జరిగింది. బయటకు వెళ్లిన భర్త, కుమారుడు ఇంటికి వచ్చాక సదరు కేటీపీఎస్ ఉద్యోగిని ప్రశ్నించగా.. వారిపైనే తిరిగి దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధిత మహిళ పోలీసులకు, కుల సంఘానికి ఫిర్యాదు చేసింది. కాగా ఫొటోలు తీసిన వ్యక్తి గతంలో సైతం అదే తరహాలో వ్యవహరించినట్లు సమాచారం. దివ్యాంగుడి కంటే ముందు అపార్ట్‌మెంట్‌లో పనిచేసే వాచ్‌మన్ భార్యపట్ల కూడా అదే తీరులో వ్యవహరించినట్లు, అపార్ట్‌మెంట్‌లో ఉండే వారితో గొడవలు పడిన సంఘటనలు ఉన్నట్లు తెలుస్తోంది. కేటీపీఎస్‌లో మహిళా ఉద్యోగులతో అసభ్యకరంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురయ్యాడని సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ రాఘవయ్యను వివరణ కోరగా... ఫిర్యాదు వచ్చిందని, అనంతరం వారు మళ్లీ మాట్లాడుకుంటామని వెళ్లిపోయారని తెలిపారు.

రెచ్చిపోతున్న గంజాయి స్మగ్లర్లు

భద్రాచలం: భద్రాచలంలో రోజురోజుకూ గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు వాహనంతో డాష్ ఇచ్చి పరారైన సంఘటన ఆదివారం జరిగింది. భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిరంతరం గస్తీ, చెకింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్ల వారుజామున మూడు గంటలకు ఓ ద్విచక్రవాహనంపై అతివేగంతో ఇద్దరు యువకులు వెళ్తున్నారు. గమనించిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ యోగానందాచారి వారిని ఆపేందుకు ప్రయత్నించారు. వారు ఆపకుండా కానిస్టేబుల్‌ను ఢీకొట్టి వెళ్లిపోయారు. తోటి సిబ్బంది కానిస్టేబుల్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చేయి విరిగినట్లుగా వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్సకు ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. కాగా పది రోజుల క్రితం ఇదే చెక్‌పోస్టు వద్ద ఇదే తరహాలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఓ కానిస్టేబల్‌ను ఢీ కొట్టి పరారైన విషయం విదితమే.

కారు, లారీ ఢీ



ప్రమాదంలో ధ్వంసమైన కారు

అశ్వారావుపేటరూరల్: కారును లారీ ఢీకొట్టిన ఘటన ఆదివారం అశ్వారావుపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద డివైడర్ నుంచి యూటర్న్ తీసుకుంటున్న కారును ఖమ్మం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జుకాగా, బెలూన్స్ తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. కారుడ్రైవర్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నలుగురిపై కేసు నమోదు

చింతకాని : గతనెల 28న ఓ మద్యం దుకాణం ఎదుట జరిగిన ఘర్షణ విషయంలో మండల పరిధిలోని నాగులవంచకు చెందిన తిరపయ్య, శ్రీను, వీరనాగులు, ముదిగొండ మండలం అమ్మపేటకు చెందిన ఉప్పిడి రాంబాబుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగులవంచలో మద్యం దుకాణం వద్ద తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ అలీపై పై నలుగురు దాడి చేయగా అలీ కాలు విరిగింది. ఈ ఘటనపై బాధితుడి భార్య నస్రీన్ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

మోసం చేస్తున్న ముఠాపై...

ఖమ్మం అర్బన్ : భూములు లేకపోయినా తప్పుడు రిజిస్ట్రేషన్లు, డబుల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామంటూ అమాయకులను మోసం చేస్తున్న ముఠా పై కేసు నమోదు చేసినట్లు ఖానాపురం హవేలీ (ఖమ్మం అర్బన్) సీఐ భానుప్రకాశ్ తెలిపారు. నగరంలో ఇటీవల భూ క్రయవిక్రయాలు తగ్గడంతో అక్రమార్జనకు అలవాటు పడిన మాయగాళ్లు ఖరీదైన భూములకు డాక్యుమెంట్లు సృష్టిస్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు రియల్ ఎస్టేట్ వ్యాపారి, మధురానగర్‌కు చెందిన షేక్.బడే సాహెబ్, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన కొత్తపల్లి వేంకటేశ్వర్లు, తిప్పర్తి అశోక్ కుమార్ (ఆర్‌ఐ)పై కేసు నమోదు చేసి వీరి నుంచి మరిన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు



శ్రీమన్నారాయణ

కల్లూరు/కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన గూడూరు శ్రీమన్నారాయణరెడ్డి(35) సాగర్ కాల్వలో గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. శ్రీమన్నారాయణరెడ్డి కొంతకాలంగా కల్లూరులో నివాసం ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం డబుల్ బెడ్‌రూమ్‌ల ఎదురుగా ఉన్న సాగర్ కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లాడు.ఈ క్రమంలో జారి నీళ్లలో పడిపోయాడు. ఆ సమయంలో కాల్వలో నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో కొట్టుకుపోతుండగా చూసిన వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు కాల్వలోకి దిగి ఎంత గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. కాల్వ గట్టుపై అతడి దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. శ్రీమన్నారాయణరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కుక్కను తప్పించబోయి ఆటో పల్టీ

నేలకొండపల్లి : కుక్కను తప్పించబోయి ఆటో పల్టీ కొట్టిన ఘటన మండలంలోని కొత్తకొత్తూరులో ఆదివారం చోటుచేసుకుంది. బైరవునిపల్లికి చెందిన ఆటో ఖమ్మం వెళ్తుండగా కొత్తకొత్తూరులో కుక్క అడ్డువచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటోపల్టీ కొట్టడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో మాత్రం బాగా దెబ్బతిన్నది.

